
సాక్షి
గుంటూరు

మంగళవారం । 5 । నవంబర్ । 2024



వెండి రాజ మకుటం వితరణ

కొల్లూరు(వేమూరు): కొల్లూరులోని అనంత భోగేశ్వరస్వామికి చందు నాగేశ్వరరావు కుటుంబసభ్యులు మూడు కిలోల వెండి రాజమకుటం వితరణ చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 587.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 9,767 క్యూసెక్కులు వదిలారు.

వెండి నేత్రాలు సమర్పణ



సత్రశాల(రెంటచింతల): సత్రశాలలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామివారికి జెట్టిపాలెం గ్రామానికి చెందిన జరావత్ మునినాయక్, కవిత దంపతులు వెండి నేత్రాలు సమర్పించారు.

న్యూస్‌రీల్

డిసెంబర్ 31 నాటికి గృహాలు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



గుంటూరు వెస్ట్: జిల్లాలో ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన కింద మంజూరైన గృహాలు ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పీఎంఏవై ద్వారా హౌసింగ్ లేఅవుట్స్‌లో సొంత స్థలాల్లో మంజూరైన ఇళ్ల ప్రస్తుత పరిస్థితిని అధికారులు సమీక్షించాలన్నారు. రూఫ్ లెవెల్‌లో ఉన్న ఇళ్లు పూర్తయ్యేలా, స్టేజ్ అప్డేషన్ సక్రమంగా జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. గృహాలపై సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యార్థులకు అపార్ ఐడీలను త్వరగా ప్రారంభించాలని పేర్కొన్నారు. పల్లె పండుగలో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన సీసీ రోడ్లు, సైడు కాలువల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ ప్రసాద్, సీపీఓ శేషశ్రీ, డ్వామా పీడీ శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లాస్థాయి జీపీడీపీ శిక్షణ


గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని గ్రామ పంచాయతీల్లో 2025-26 వార్షిక ప్రణాళిక రూపకల్పనపై జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులతోపాటు పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం నుంచి ఈనెల 8వ తేదీ వరకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై శిక్షణ నిర్వహిస్తున్నట్టు జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రణాళిక ఉద్యమం 2025-26లో భాగంగా గ్రామ పంచాయతీ, మండల పరిషత్ అభివృద్ధి, జిల్లా పంచాయతీ, జిల్లా ప్రజా పరిషత్ అభివృద్ధి ప్రణాళికలపై సమగ్ర కార్యాచరణ తయారీకి ఈ శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఈనెల 5,6వ తేదీల్లో పల్నాడు, 7,8వ తేదీల్లో గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని మండలాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించే శిక్షణా కార్యక్రమాలకు అధికారులు, ఉద్యోగులు హాజరు కావాలని సూచించారు.

40,989 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 40,989 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 35,381 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 18,300 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,500 నుంచి రూ. 17,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 17,800 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 23,765 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 7226 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 306 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 1486 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 720 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 197 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 440 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 3340 క్యూసెక్కులు విడుదల చేశారు.

సోషల్ మీడియాపై కాలకూటమి



పచ్చ బ్యాచ్ 'ఎర్ర' వేషాలు

- వేధించడమే లక్ష్యం
- పోస్టులు పెడుతున్నారంటూ కేసులు
- వైఎస్సార్ సీపీకి అండగా ఉన్న వారే టార్గెట్
- 2018లో పోస్ట్ పెట్టాడంటూ ఆళ్ల జగదీశ్ రెడ్డి అరెస్ట్
- మహిళా కార్యకర్తలనూ వదలని వైనం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో కూటమి అరాచకాలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: కూటమి ప్రభుత్వ అవినీతిని, హామీల అమలులో వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాపై ప్రభుత్వం వేధింపులకు దిగింది. అరెస్టులు చేసి కేసులు పెడుతూ, స్టేషన్‌కు పిలిచి బెదిరింపులకు దిగుతోంది. రెండు రోజులుగా సోషల్‌మీడియా కార్యకర్తలే టార్గెట్‌గా పోలీసులు వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. సుప్రీంకోర్టు నిబంధనలనూ ఉల్లంఘిస్తూ, అర్ధరాత్రి వేళ కనీసం ఎక్కడికి తీసుకెళ్తున్నారన్న విషయాన్ని కుటుంబ సభ్యులకూ చెప్పకుండా తరలిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. మఫ్టీలో వస్తుంది పోలీసులా, తెలుగుదేశం కార్యకర్తలో అర్థం కాక బాధితులు తీవ్ర ఆందోళన చెందుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. బాధిత కుటుంబ సభ్యులను పోలీసు స్టేషన్ల చుట్టూ రోజుల తరబడి తిప్పుతున్నారు. స్థానిక తెలుగుదేశం నాయకులతో మాట్లాడుకోవాలని, లేకపోతే ఊరు వదిలి వెళ్లిపోవాలంటూ పోలీసులే కూటమి ప్రభుత్వం తరపున బెదిరింపులకు దిగుతుండడం విస్మయానికి గురిచేస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. పల్నాడు జిల్లాలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంది. సోషల్‌మీడియా కార్యకర్తలపై పెడుతున్న అక్రమ కేసులను ఎదుర్కొనేందుకు వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ న్యాయపోరాటానికి సన్నద్ధం అయ్యింది. కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇస్తోంది.



మేకా వెంకటరామిరెడ్డికి మద్దతుగా తాడేపల్లి పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్న వైఎస్సార్ సీపీ నేత దొంతిరెడ్డి వేమారెడ్డి

జూలైలో సోషల్ మీడియా కార్యకర్తపై హత్యాయత్నం

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్త, సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన మట్టుపల్లి ఏసుబాబు (మోజెస్)పై నందిగామ అడ్డరోడ్డులో జూలై 24న రాత్రి హత్యాయత్నం జరిగింది. స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై మోజెస్ వెళ్తుండగా ఆరుగురు టీడీపీ గూండాలు పథకం ప్రకారం వచ్చి కర్రతలతో దాడి చేశారు. 'కళ్ళం విజయ భాస్కర్ రెడ్డి అండ చూసుకొని కన్నా లక్ష్మీ నారాయణపైనే ఎన్నికలకు ముందు పోస్టులు పెడతావా? ఇప్పుడు నిన్ను చంపితే ఎవడొస్తాడో ఇప్పుడు రమ్మను? చూద్దాం' అంటూ కులం పేరుతో దూషిస్తూ తీవ్రంగా గాయ పరిచారు. అప్రమత్తమైన స్థానికులు మోజెస్‌ను చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించగా ప్రాణాలతో బయటపడ్డాడు.

ఇవిగో నిదర్శనాలు



పోలీస్‌స్టేషన్ వద్ద వెంకటరామిరెడ్డి

సోషల్‌మీడియాలో పోస్టు పెట్టారని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా గుంటూరు జిల్లా అధ్యక్షులు మేకా వెంకటరామిరెడ్డిని పోలీసులు సోమవారం అరెస్టు చేసి తాడేపల్లి పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారు.

- ఈ నెల 2న వైఎస్సార్‌సీపీ నాయకురాలు పాలేటి కృష్ణవేణినీ పోస్టులు పెట్టారని చిలకలూరిపేట అర్బన్ పోలీసులు అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపరచగా ఆమెకు బెయిల్ లభించింది. ఆమెపై పోలీసు స్టేషన్ వద్ద, కోర్టు వద్ద దాడికి తెలుగు మహిళలు యత్నించారు. గతంలో కృష్ణవేణి భర్త రాజకుమార్‌ను తెలుగుదేశం నాయకులు కిడ్నాప్ చేసి తీవ్రంగా కొట్టారు. లోకేష్ చిత్రపటం వద్ద మోకాళ్లపై నిలబెట్టి దణ్ణం పెట్టించి క్షమాపణలు చెప్పించారు. అప్పటి నుంచి ఆ కుటుంబాన్ని తెలుగుదేశం నేతలు వేధిస్తూనే ఉన్నారు. కోర్టు బెయిల్ ఇచ్చినా వేధింపులు మాత్రం ఆగలేదు.
- తెనాలి నియోజవర్గం కొల్లిపర మండలం వల్లభాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త, రైతు ఆళ్ళ జగదీష్ రెడ్డిపై కేసు మరీ విచిత్రంగా ఉంది. 2018లో పవన్‌కళ్యాణ్, నాదెండ్ల మనోహర్‌పై పోస్టు పెట్టారని రెండురోజుల క్రితం విజయవాడ సైబర్ క్రైమ్ సిటీ పోలీసులు అర్ధరాత్రి అరెస్టు చేసి తీసుకువెళ్లారు. రెండురోజులైనా కోర్టులో హాజరుపరచకపోవడంతో వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ రంగంలోకి దిగింది. దీంతో దిగొచ్చిన పోలీసులు ఆయనను వదిలిపెట్టారు.
- వైఎస్సార్ సీపీ యువజన విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షుడు కల్లం హరికృష్ణారెడ్డి మీద సోషల్ మీడియా కేసు నమోదైంది. లోకేష్ చంద్రబాబు కుటుంబంపై పోస్ట్ చేసినందుకు టీడీపీ తాడికొండ మండలం మోతడక గ్రామ అధ్యక్షుడు రావి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.
- కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో వైఎస్సార్ సీపీకి చెందిన ఎస్సీ నాయకుడు బండారు జయ కుమార్‌పై చిలకలూరిపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ఆధారాలు లభించకపోవడంతో కారుమూరి రాంబాబు అనే అతని వద్ద రూ.రెండు లక్షలు తీసుకొని డబ్బులు ఎగ్గొట్టి అతనిపై దాడి చేశాడంటూ తప్పుడు కేసు పెట్టారు.
- చిలకలూరిపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఇన్చార్జి దొడ్డ రాకేష్ గాంధీని టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలోనే అరెస్టు చేసేందుకు యత్నించారు. అప్పటి నుంచి అతను అజ్ఞాతంలోనే ఉండాల్సి వచ్చింది.
- సత్తెనపల్లి రూరల్‌కు చెందిన వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ మర్రి శివప్రసాద్‌కు ఇటీవల టీడీపీ నేతల నుంచి బెదిరింపు ఫోన్‌కాల్స్ వచ్చాయి. గుంటూరు నుంచి టీడీపీ సోషల్ మీడియా విభాగానికి చెందిన వారు ఫోన్ చేసి పోస్టు పెడితే జైలు ఊచలు లెక్కించక తప్పదంటూ బెదిరించారు.
- పవన్ కళ్యాణ్‌పై వినుకొండ మండలం పానకాల పాలెం వాసి నన్నపనేని వెంకట్రావు పోస్టు పెట్టాడని జనసేన నేత నిశంకర శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వినుకొండ సీఐ కేసు నమోదు చేశారు. ఆదివారం వెంకట్రావును అదుపులోకి తీసుకుని స్టేషన్ బెయిల్‌పై వదిలారు.
- మాచర్ల రూరల్ పరిధిలోని కంభంపాడుకు చెందిన నెమలి దిన్నె రంగారెడ్డి పోస్టులు పెడుతున్నారంటూ కేసు నమోదు చేశారు.
- గురజాల మండలం తేలుకుట్లకు చెందిన వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ పప్పుల వెంకటరామిరెడ్డిని సోమవారం పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేసి గురజాల పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. గత నెల 15న గురజాల నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ వెన్నా రాజశేఖర్‌రెడ్డిని, పిడుగురాళ్ల మండల సోషల్ మీడియా కన్వీనర్ షేక్ మాబులనూ పోలీసులు అరెస్టు చేశారు.

అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు

- తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజన సింహా
- మున్నంగిలో ఇసుక లోడింగ్‌పై తనిఖీ



సాక్షి ఎఫెక్ట్

మున్నంగి(కొల్లిపర): 'శాండ్ శాసనులు.. కృష్ణా నది వద్ద వసూల్ రాజాలు' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో సోమవారం ప్రచురితమైన వార్తా కథనానికి స్పందన లభించింది. కొల్లిపర మండలంలోని మున్నంగి ఇసుక రీచ్‌ను సోమవారం తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ, తహసీల్దార్ సిద్ధార్థతో కలసి తనిఖీ చేశారు. అక్కడ ఉన్న రెవెన్యూ సిబ్బంది, ఇసుక వినియోగదారులతో మాట్లాడారు. ట్రాక్టర్లలో ఇసుక లోడింగ్ గురించి కూలీలను అడిగి తెలుసుకున్నారు. కృష్ణానది నుంచి తీస్తున్న ఇసుక తెనాలి, గుంటూరుకు కూడా వెళుతోందా? అని ప్రశ్నించారు. కృష్ణానదిని ఆనుకుని ఉన్న పరిసర గ్రామాలకు మాత్రమే ఇసుక తవ్వకాలకు అనుమతి ఉందన్నారు. ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అనుమతి లేదని స్పష్టంగా చెప్పారు. ఉచిత ఇసుక విధానంలో ట్రాక్టర్లు, ఎండ్ల బండ్లకు అనుమతి ఉందన్నారు. ట్రాక్టర్‌లో ఇసుక లోడింగ్ చేసినందుకు అదనంగా వసూలు చేయొద్దని హెచ్చరించారు. ఉచిత ఇసుక విధానంలో ఎంతవరకు డబ్బులు చార్జి చేయొచ్చనేది జిల్లా కలెక్టరుతో సంప్రదించి, రెండురోజుల్లో చెబుతామని తెలిపారు. ఇసుక రీచ్‌లో బాటలు అవసరమైతే, కూలీలు మాత్రమే వేయాలని చెబుతూ ఏదైనా యంత్రం నదిలో దిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అర్జీలపై అలసత్వం ప్రదర్శిస్తే మెమోలు

- అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి హెచ్చరిక
- స్పందన కార్యక్రమంలో అర్జీల స్వీకరణ

గుంటూరు వెస్ట్: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న సమస్యలను గుర్తించడంతోపాటు వీలైనంత త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆయా జిల్లా శాఖాధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న అర్జీలను ప్రతివారం ఒకసారి సమీక్షించాలని సూచించారు. రెవెన్యూ, రోడ్లు భవనాల శాఖ, జీఎంసీ తదితర శాఖల్లో అభివృద్ధి పనులు అనుకున్నంత వేగంగా సాగడంలేదన్నారు. చిన్న చిన్న సమస్యలను వదిలేయవద్దని తెలిపారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే మెమో జారీ చేస్తామని అధికారులను హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తే కలెక్టరేట్ వరకు ప్రజలు రారని తెలిపారు. ముఖ్యంగా ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. ఒకే అర్జీ పరిష్కారం కోసం పదేపదే తిప్పుకోకుండా చూడాలన్నారు. పరిష్కారానికి అవకాశంలేని వాటిని వివరించి తెలపాలన్నారు. అనంతరం వచ్చిన 151 ఫిర్యాదులను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, డీఆర్వో పెద్ది ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, అధికారులు

వీఆర్ఏల సమస్యలను పరిష్కరించండి

వీఆర్ఏల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలి. 5 ఏళ్ళు సర్వీసు పూర్తి చేసుకుని, ఇంటర్ ఉత్తీర్ణత ఉన్నవారికి వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలి. ఇసుక రీచ్‌ల వద్ద, పాఠశాలల వద్ద వేసిన వాచ్‌మెన్ డ్యూటీలు రద్దు చేయాలి. తెలంగాణలో అమలవుతున్న విధానాలు మన రాష్ట్రంలోనూ అమలు చేయాలి.

– ఏపీ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు



తెనాలి శిల్పుల అద్భుత ప్రతిభ

- మేవార్ రాజు మహారాణా ప్రతాప్ సింగ్ ఫైబర్ గ్లాస్ విగ్రహం తయారీ
- గతంలోనూ చారిత్రక మహనీయుల శిల్పాలను తీర్చిదిద్దిన ఘనత

తెనాలి: మేవార్ మహారాజు మహారాణా ప్రతాప్‌సింగ్ భారీ ఫైబర్ గ్లాస్ విగ్రహం స్థానిక సూర్య శిల్పశాలలో రూపుదిద్దుకుంది. ప్రకాశం జిల్లా మార్కాపురంలో ప్రతిష్ఠించేందుకు దీనిని తయారు చేశామని తెనాలికి చెందిన విగ్రహ శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, ఆయన కుమారులు రవిచంద్ర, శ్రీహర్ష సోమవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గతంలో చత్రపతి శివాజీ, శ్రీకృష్ణదేవరాయలు, టిప్పు సుల్తాన్, కెంపెగౌడ, రాణీ రుద్రమదేవి, రాణీ కిట్టూరు చెన్నమ్మ, సంగోలి రాయన్న, కృష్ణరాజ వడియార్, బసవేశ్వర మహారాజ్ వంటి చారిత్రక ప్రముఖుల విగ్రహాలను తయారు చేశామని, రాణా ప్రతాప్‌సింగ్ విగ్రహం తయారు చేయలేదన్న కొరత నేటితో తీరిందని శిల్పి కాటూరి చెప్పారు. సూర్య శిల్పశాలలో ప్రదర్శించిన ఈ విగ్రహాన్ని తెనాలి డీఎస్పీ బి.జనార్దన రావు తిలకించారు. శిల్పంలో జీవకళ ఉట్టిపడుతోందని ప్రశంసించారు. శిల్పులతోపాటు విగ్రహ కమిటీ సభ్యులు భవానిసింగ్, సూర్యప్రతాప్ సింగ్, కళ్యాణ్ సింగ్, శ్రీనివాసరావుసింగ్, అంజన్‌సింగ్, బలరాంసింగ్‌ను డీఎస్పీ శాలువాలతో సత్కరించారు. రాణా ప్రతాప్‌సింగ్ మహారాజు విగ్రహాన్ని రాజస్తాన్ నుంచి మార్కాపురం ప్రాంతానికి వలస వచ్చిన మేవార్ వంశస్తులంతా కలిసి ఏర్పాటు చేస్తున్నట్లు విగ్రహ కమిటీ సభ్యులు చెప్పారు. శిల్పి కాటూరి రవిచంద్ర మాట్లాడుతూ గత వారం అమెరికాలోని అట్లాంటాలో ఆవిష్కరించిన నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహం కూడా తమ చేతుల మీదుగానే తయారైందని చెప్పారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా అమెరికా, జర్మనీ, కెనడా, ఆస్ట్రేలియా దేశాల్లో పదుల సంఖ్యలో ప్రతిష్ఠించిన విగ్రహాలను తీర్చిదిద్దే అవకాశం తమకు లభించిందని చెప్పారు. శిల్పకళలో తెనాలి ప్రాంతానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడమే తమ లక్ష్యమని వివరించారు.



మహారాణా ప్రతాప్‌సింగ్ విగ్రహంతో శిల్పులు వెంకటేశ్వరరావు, రవిచంద్ర

కార్తీకం.. దేదీప్యమానం

పెదకాకాని శివాలయంలో భక్తుల సందడి



పెదకాకాని శివాలయంలో కార్తీకదీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు

పెదకాకాని: శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం కార్తీక తొలి సోమవారం సందర్భంగా భక్తులతో కళకళలాడింది. భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే భక్తుల సందడి నెలకొంది. తొలుత యజ్ఞాల బావి నీటితో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కార్తీకదీపాలు వెలిగించి పూజలు చేశారు. అనంతరం భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని అభిషేకాలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు, సిబ్బంది ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో దాతల సహకారంతో భక్తులకు పాలు మజ్జిగ, తాగునీరు అందించారు. తలనీలాల సమర్పణ, వాహనపూజలు, అన్నప్రాశనలు, అంతరాలయ దర్శనాలు, అభిషేకాలు, రాహకేతుపూజలు, నవగ్రహపూజలు జరిగాయి.

దర్శించుకున్న ప్రముఖులు

గుంటూరు జిల్లా 2వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి నాగరాజు, ఆరో ఎంఎం కోర్టు న్యాయమూర్తి శ్రీలత, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి సోమవారం స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రముఖులకు ఘన స్వాగతం పలికారు. వేద ఆశీర్వచనం, స్వామి శేష వస్త్రం అందించి సత్కరించారు. ఆలయ అధికారులు స్వామి ప్రసాదాలు అందజేశారు. పెదకాకాని పోలీసులు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా బందోబస్తు నిర్వహించగా అగ్నిమాపకశాఖ, పంచాయతీశాఖ, వైద్యశాఖల వారు సహాయ సహకారాలు అందించినట్లు ఆలయ డెప్యూటీ కమిషనర్ తెలియజేశారు.



భక్తులతో సందడిగా మారిన శివాలయం ప్రాంగణం

అవినీతికి పాల్పడ్డ ఆర్ఐ సస్పెన్షన్

మంగళగిరి: అవినీతికి పాల్పడ్డ ఆర్ఐను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మంగళగిరి తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్ఐ సాంబశివరావు ప్రజలకు వివిధ ధ్రువీకరణ పత్రాలకు నగదు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదు మేరకు విచారించిన కలెక్టర్ నాగలక్ష్మి సోమవారం ఆర్ఐతోపాటు ఆర్ఐకు సహకరిస్తున్న మరో ఉద్యోగి రమణను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్టీసీలో అప్రెంటీస్ కోసం దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: ఏపీఎస్‌ఆర్టీసీలో అప్రెంటీస్ చేసేందుకు ఐటీఐ అభ్యర్థులు ఈనెల 6వ తేదీ నుంచి 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విజయవాడ జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ వి.నీలిమ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దీనికి అర్హులన్నారు. వీరందరూ జిల్లాల వారీగా www.aprenticerhipindia.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మార్కులు, సీనియార్టీ ప్రకారం ఎంపికలు జరుగుతాయన్నారు.

కీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి



కీచక ఉపాధ్యాయుడు నవీన్

తాడేపల్లిరూరల్: కుంచనపల్లి గీతాంజలి పాఠశాలలో ఓ విద్యార్థిని పట్ల ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆ విద్యార్థిని తల్లిదండ్రులు సోమవారం స్కూల్‌కు వెళ్లి కీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. సేకరించిన వివరాల ప్రకారం కుంచనపల్లి గీతాంజలి పబ్లిక్ స్కూల్‌లో పనిచేస్తున్న నవీన్ అనే ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు స్కూల్ యాజమాన్యానికి నాలుగు రోజుల క్రితం పలు తరగతుల విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. స్కూల్ యాజమాన్యం పట్టించుకోకపోవడంతో సోమవారం మంగళగిరికి చెందిన విద్యార్థిని కుటుంబ సభ్యులకు విషయం చెప్పింది. దీంతో ఆ విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడిని నిలదీశారు. అతనికి పెళ్లి అయి ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలియడంతో నీ పిల్లల పట్ల కూడా ఇలాగే ప్రవర్తిస్తున్నావా అంటూ ఓ తల్లి అతడ్ని చెప్పు తీసుకుని కొట్టింది. ఘటనపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమాదేవి మాట్లాడుతూ గతంలో తమ పాఠశాలలో ఇలాగే జరిగితే కేసు నమోదు చేశామని, మళ్లీ ఇలా జరగడం చాలా బాధాకరమని, ఇప్పటికే విద్యార్థులకు పలుసార్లు అవగాహన కల్పించామని ఎవరైనా ఉపాధ్యాయులు అసభ్యంగా ప్రవర్తిస్తే తమకు తెలియజేయాలని చెప్పామని, జరిగిన ఘటనపై ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె తెలిపారు.



ఉపాధ్యాయుడిని చెప్పుతో కొడుతున్న విద్యార్థిని బంధువు

మన్నెసుల్తాన్‌పాలెంలో మొసలి సంచారం

బెల్లంకొండ: మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెంలోని ఊరి చివర బస్టాండ్ సమీపంలో సోమవారం రాత్రి మొసలి సంచరించడాన్ని స్థానికులు గమనించారు. మొసలి పొలాలలో నుంచి రోడ్డుపైకి వస్తుండగా బైకులపై వెళ్లే ప్రయాణికులు గమనించారు. రోడ్డుమీదకు వచ్చి దాదాపుగా పావుగంట సేపు ఎటు వెళ్లకుండా ఆగిపోయింది. దీంతో వాహనచోదకులు అక్కడే నిలిచిపోయారు. కొంతసేపటి తర్వాత పక్కనే ఉన్న ముళ్లపొదల్లోకి వెళ్లడంతో ఊపిరి పీల్చుకున్నారు.



క్లుప్తంగా

పెదకాకాని మల్లేశ్వరస్వామి ఆలయ ఇన్‌చార్జి డీసీగా శ్రీనివాస్‌



పెదకాకాని: పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (శివాలయం) ఇన్‌చార్జి డెప్యూటీ కమిషనర్‌(డీసీ)గా దేవదాయశాఖ గుంటూరు జోన్‌ డీసీ కేబీ శ్రీనివాస్‌ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీసీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న గోగినేని లీలాప్రసాద్‌ వ్యక్తిగత సెలవులపై వెళ్లడంతో ఆ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా జోన్‌ ఉప కమిషనర్‌ శ్రీనివాస్‌ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దాతల సహకారంతో ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. కార్తిక మాసం సందర్భంగా ఆలయానికి తరలి వస్తున్న భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు.

సాఫ్ట్‌వేర్‌ కంపెనీ పేరుతో మోసగించిన నిందితుడి అరెస్ట్‌

లక్ష్మీపురం: సాఫ్ట్‌వేర్‌ కంపెనీలో ఉద్యోగాలు పేరుతో మోసగించిన కేసులో ఒకరిని పోలీసులు సోమవారం అరెస్ట్‌ చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. అమరావతి రోడ్డులోని ఆంజనేయ పేట ప్రాంతంలో దగ్గుపాటి శ్రావణ్‌కుమార్‌ డెవలప్‌ ట్రీస్‌ డీఎస్‌ఆర్‌ఐటీ సొల్యూషన్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ అనే పేరుతో ఒక సాఫ్ట్‌వేర్‌ కంపెనీని ప్రారంభించారు. ఈ సాఫ్ట్‌వేర్‌ కంపెనీలో ఆన్‌లైన్‌, ఫేస్‌బుక్‌ వంటి వాటి ద్వారా సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగాలు ఉన్నాయని చెప్పడంతో సుమారు 80 మందికి పైగా పలు జిల్లాలకు చెందిన వారు లక్షలాది రూపాయలు ఎదురు చెల్లించి చేరారు. అయితే వారి నుంచి కంపెనీలో పనులు చేయించుకుంటూ వారికి 3 నెలలుగా జీతాలు చెల్లించడం నిలిపి వేశాడు. దీంతో పాటు జీతాలు అడిగిన వారి పై సంస్థ యజమాని శ్రావణ్‌కుమార్‌ బెదిరింపులకు దిగడం ప్రారంభించాడు. నిలదీసిన వారిని దగ్గుపాటి పురందేశ్వరి బంధువులమని, అధికార పార్టీ అండదండలు ఉన్నాయంటూ ఉద్యోగులను బెదిరించడం ప్రారంభించారు. దీంతో దిక్కుతోచక సంస్థలో ఉద్యోగాలు చేసే వారందరూ ఒక్కసారిగా జీతాలు చెల్లించడం లేదని సంస్థ యజమాని భార్యను నిలదీశారు. సమాచారం తెలుసుకున్న అరండల్‌పేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంస్థ యజమాని శ్రావణ్‌కుమార్‌ పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేశారు. వీరిలో ఏటీ అగ్రహారం 18వ లైన్‌ ప్రాంతానికి చెందిన పగిడిపాటి మల్లికార్జునరెడ్డి అనే వ్యక్తి ఆదివారం అర్ధరాత్రి ఆంజనేయపేట సాఫ్ట్‌వేర్‌ కంపెనీ వద్దకు వచ్చినట్లు సమాచారం రావడంతో అరండల్‌పేట పోలీసులు అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం సోమవారం రాత్రి అరెస్ట్‌ చేశారు.

ఇంటిని కొంటామంటూ ఓ ఏఎస్‌ఐ మోసం

- రూ.14 లక్షలు తీసుకున్నాడు
- ఏళ్లు గడిచినా ఇవ్వట్లేదు
- అడిగితే బెదిరిస్తున్నాడు
- ఎస్పీకి బాధితుడు ఫిర్యాదు
- పోలీస్‌ స్పందనలో అర్జీలు స్వీకరించిన ఎస్పీ సతీష్‌కుమార్‌



బాధితుల సమస్య ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌

నగరంపాలెం(గుంటూరు వెస్ట్‌): పల్నాడు జిల్లాలో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న ఓ వ్యక్తి తనను మోసం చేసి రూ.14లక్షలు తీసుకున్నాడని, అడిగితే తిరిగి ఇవ్వడం లేదని, బెదిరిస్తున్నాడని పాతగుంటూరుకు చెందిన బాధితుడు రావుల వరాలు ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. స్థానిక జిల్లా పోలీస్‌ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. బాధితుల నుంచి ఎస్పీ సతీష్‌ కుమార్‌ ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీదారుల మొరను ఆలకించారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని సబ్‌ డివిజన్ల పోలీస్‌ అధికారులను ఆదేశించారు. జిల్లా ఏఎస్పీ (పరిపాలన) రమణ మూర్తి, డీఎస్పీలు అర్జీలు స్వీకరించారు.

రూ.14 లక్షలు కాజేశాడు



చాన్నాళ్లుగా మిర్చి వ్యాపారం చేస్తున్నా. నగరంపాలెం రెండో వీధిలో సుమారు 500 గజాలు పైబడిన పాత ఇల్లు ఉంది. వ్యాపార అవసరాల నిమిత్తం సుమారు మూడేళ్ల క్రితం ఇల్లు విక్రయించేందుకు బేరం పెట్టాం. ప్రస్తుతం పల్నాడులో పనిచేస్తున్న ఓ ఏఎస్‌ఐతో ఆయన గతంలో కొత్తపేట పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసిన సమయం నుంచి పరిచయం ఉంది. ఏఎస్‌ఐ గుంటూరు రామిరెడ్డి తోటకు చెందిన ఓ వ్యక్తిని తీసుకొచ్చాడు. ఇల్లు కొనేందుకు వచ్చిన వ్యక్తి చేతికి ఉంగరాలు, బ్రాస్‌లెట్‌, సూటుబూట్‌ ధరించి కారులో వచ్చాడు. ఇల్లు చూసి రూ.2 కోట్లకు కొనేందుకు బేరం కుదిరింది. అయితే ఇంటిని కొనుగోలు చేసే ఆ వ్యక్తికి ప్రకాశం జిల్లా చీమకుర్తిలో గ్రానైట్‌ క్వారీ ఉందని నమ్మించారు. క్వారీని రూ.58 కోట్లకు విక్రయించామని తెలిపారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్‌ ఆగిందని, జీఎస్టీ రూపేణా రూ.15 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. రిజిస్ట్రేషన్‌ ముగిసి డబ్బులు వచ్చాక, తిరిగి రూ.15 లక్షలు చెల్లిస్తామని బదులిచ్చారు. దీంతో రెండు విడతలుగా ఏఎస్‌ఐకు రూ.14 లక్షలు చెల్లించా. వారంలో చెల్లిస్తానని చెప్పిన ఏఎస్‌ఐ మూడు నెలలు కనిపించలేదు. తర్వాత అతనిచ్చిన చెక్కుతో ప్రయోజనంలేదు. ఎప్పుడైనా కనిపించినప్పుడు నగదు అడిగితే విధుల్లో ఉన్న ఏఎస్‌ఐకు ఆటంకం కల్గించావంటూ హడావుడి చేసి, నగరంపాలెం పీఎస్‌లో ఫిర్యాదు చేస్తామని బెదిరించేవాడు. ఒకవేళ తనపై పోలీస్‌ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా భయపడేది లేదని చెప్పేవాడు. దీంతో వెనక్కి తగ్గేవాడ్ని. ఏఎస్‌ఐ నుంచి తనకు రావాల్సిన రూ.14 లక్షలు ఇప్పించాలని కోరుతున్నా.

– రావుల వరాలు, రాములవారిగుడి, పాత గుంటూరు.

జీతాలు చెల్లించడంలేదు..

గుంటూరు లక్ష్మీపురంలోని ఓ వస్త్ర దుకాణంలో మహిళా సెక్యూరిటీ గార్డులుగా పనిచేశాం. అయితే జీతాలు సక్రమంగా చెల్లించకపోవడంతో అందులో మానేశాం. ప్రస్తుతం డబ్బులు చెల్లించాలని అడిగితే పోలీసు కేసులు నమోదు చేయిస్తామంటూ బెదిరిస్తున్నారు. పిల్లల ఫీజులు చెల్లించేందుకు ఇబ్బందిగా ఉందని ప్రాధేయపడినా కనికరించడంలేదు. సదరు వస్త్ర దుకాణ నిర్వాహకులతో మాట్లాడి, న్యాయం చేయాలని కోరుతున్నాం.

– కె.పద్మావతి, ఎం.హేమలత, కొత్తరోడ్డు ఒకటో వీధి, స్వర్ణభారతి

బంగారం దుకాణం పేరుతో మోసం

మహిళలు ఏకమై మరో మహిళను మోసగించారు. దాదాపు రూ.5 కోట్ల వరకు లాగేసుకున్నారని బాధిత మహిళ సోమవారం జిల్లా పోలీస్‌ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. కుమార్తెకు ఉద్యోగం రాలేదని ఏడాది క్రితం ఓ సిద్ధాంతి వద్దకు వెళ్లాను. అక్కడ ముత్యాలరెడ్డినగర్‌కు చెందిన ఓ మహిళ పరిచయమైంది. ఆమె కుమారుడు లండన్‌ వెళ్తున్నాడని, యూనివర్సిటీ ఫీజు కోసం రూ.32 లక్షలు కావాలని తెలిపింది. స్థలం విక్రయించి, డబ్బులిస్తానని ఇవ్వలేదు. అదే సమయంలో సంగడిగుంటకు చెందిన మరో మహిళ నా వద్దకు వచ్చి, ఆమె చేతిలో మోసపోయినట్లు చెప్పింది. వారిద్దరూ ఏకమై, డబ్బులు కాజేసేందుకు పన్నాగం పన్నారు. దీంతో వారిద్దరూ విజయవాడ కేతనకొండ గ్రామానికి చెందిన మరో మహిళను పరిచయం చేశారు. బంగారం వ్యాపారంలో లాభాలు వస్తాయని చెప్పి, గతేడాదిలో రూ.4.50 కోట్లు, 600 గ్రాముల బంగారం తీసుకున్నారు. ఇంకా మరో రూ.1.50 కోట్లు అడగ్గా, లేవని చెప్పాను. మొత్తం చెల్లిస్తేనే బంగారు దుకాణం అప్పగిస్తామని వారు తేల్చిచెప్పారు. అంతేగాక ఈ ఏడాది జనవరిలో మా ఇంటికి వచ్చి బీభత్సం సృష్టించారు. ఈక్రమంలో కృష్ణలంక పీఎస్‌లో వారిపై ఫిర్యాదు చేశాను. వారిని విచారించే సమయంలో గుంటూరు నుంచి ఓ వ్యక్తి వచ్చి తాను మంత్రి నారా లోకేష్‌ మనిషినని, కేంద్ర మంత్రులు, ఎమ్మెల్యేలు తెలుసునని చెప్పి కేసు నమోదుకాకుండా అడ్డుకున్నాడు. సదరు వ్యక్తులను పిలిచి రూ.4.50 కోట్లు, 600 గ్రాముల బంగారం ఇప్పించాలని లేనిచో ఆత్మహత్య శరణ్యమని వేడుకుంది.

– ఓ మహిళ, గుంటూరు టౌన్‌.

యువత నైపుణ్యాలను పెంచుకోవాలి

జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు



మాట్లాడుతున్న తమ్మాజీరావు

నరసరావుపేట ఈస్ట్‌: యువత నైపుణ్యాలను అభివృద్ధి పరుచుకోవటం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సులువుగా పొందవచ్చని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, సీడాప్‌ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌ ఆవరణలోని ఎన్‌ఏసీ శిక్షణ కేంద్రంలో జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌ మేళాకు మూడు కంపెనీలు హాజరై జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 66మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 46మందిని ఎంపిక చేశారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందించే కార్యక్రమంలో పాల్గొన్న తమ్మాజీరావు మాట్లాడుతూ విద్యార్హతలతోపాటు నైపుణ్యత, భావ వ్యక్తీకరణ పెంచుకోవాలన్నారు. ఎన్‌ఏసీ శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి మేరీజోష్న మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను నిరుద్యోగ యువత సద్వినియోగపరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్‌ అధికారి ఎం.రవీంద్రనాయక్‌, స్కిల్‌ హబ్‌ కోఆర్డినేటర్‌ ఎం.వీరాంజనేయులు, పి.శ్రీకాంత్‌, ఉపాధి కల్పన కార్యాలయ సిబ్బంది ఈ.శ్రీనివాసరావు, కంపెనీల హెచ్‌ఆర్‌లు పాల్గొన్నారు.

పింఛన్ల డబ్బుతో ఉద్యోగి అదృశ్యం

మర్నాడు వచ్చి డబ్బు అప్పగింత

ప్రత్తిపాడు: లబ్ధిదారులకు అందించాల్సిన పింఛను సొమ్మును పంపిణీ చేయకుండా ఓ ఉద్యోగి మాయమై, మర్నాడు తిరిగివచ్చి మరో ఉద్యోగికి పింఛను డబ్బులు అప్పగించిన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. ప్రత్తిపాడు మండలంలోని పెదగొట్టిపాడు పంచాయతీలో ఓ ఉద్యోగికి పింఛను పంపిణీ బాధ్యతలను అధికారులు అప్పగించారు. ఈనెల 1న పింఛన్ల సొమ్మును సదరు ఉద్యోగికి అందించారు. అతను ఉదయం పది గంటలకు విధులకు వచ్చి, కొన్ని పింఛన్లు పంపిణీ చేశాడు. అనంతరం చెప్పాపెట్టకుండా పింఛను సొమ్ముతో గ్రామం నుంచి వెళ్లిపోయి, మొబైల్‌ స్విచ్‌ ఆఫ్‌ చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి మండల, జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు సమాచారమందించారు. ఇదే విషయమై అధికారులు పోలీసులకూ ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఆ ఉద్యోగి మర్నాడు రెండవ తేదీ ఉదయం గ్రామానికి వచ్చిన తన వద్ద ఉన్న 17 పింఛన్లకు సంబంధించిన రూ.68 వేల నగదును సచివాలయ ఉద్యోగికి అప్పగించినట్లు అధికారులు తెలిపారు. దీనిపై ఎంపీడీవో శివపార్వతిని అడగ్గా పింఛన్ల పంపిణీ అనంతరం మిగిలిన సొమ్మును తీసుకువెళ్లాడని, మరుసటి రోజు వచ్చి ఆ డబ్బును సచివాలయ ఉద్యోగులకు అప్పగించాడని చెప్పారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా పింఛన్ల పంపిణీ పూర్తిచేశామని వెల్లడించారు.

ఏపీ స్టూడెంట్‌ జేఏసీ కార్యవర్గం నియామకం



ఏపీ స్టూడెంట్‌ జేఏసీ నూతన కార్యవర్గం

ఏఎన్‌యూ: ఆంధ్రప్రదేశ్‌ స్టూడెంట్‌ జేఏసీ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ శాఖ నూతన కార్యవర్గాన్ని నియమించినట్లు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్‌ తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సోమవారం జరిగిన సమావేశంలో హేమాద్రి యాదవ్‌ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో, యూనివర్సిటీలలో ఏపీ స్టూడెంట్‌ జేఏసీ అధ్యక్ష నియామకాలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా ఏఎన్‌యూ శాఖకు అధ్యక్ష, కార్యదర్శులుగా కె.వెంకటేష్‌ , కె.కిషోర్‌, ఉపాధ్యక్షులుగా మహేష్‌, గణేష్‌, కోశాధికారిగా హర్షను నియమించామని తెలిపారు. రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలపై పోరాడడంలో ఏపీ స్టూడెంట్స్‌ జేఏసీ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో బీసీఎస్‌ఎఫ్‌ స్టేట్‌ ప్రెసిడెంట్‌, ఏపీ స్టూడెంట్స్‌ జేఏసీ మాజీ అధ్యక్షుడు కోటి యాదవ్‌, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉత్తన్నకుమార్‌, తిరుపతి జిల్లా గార్లపాటి శ్రీధర్‌, బీసీఎస్‌ఎఫ్‌ అధ్యక్షులు రామకృష్ణ, పరిశోధకులు సునీల్‌, వాసు, చంటి బాబు, సతీష్‌ పవన్‌ తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య పరీక్షల్లో ప్రత్యేక పరిశీలక బృందం విస్తృత తనిఖీలు

- వర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన కళాశాల గుర్తింపు
- పరీక్ష కేంద్రం రద్దు
- మరో పరీక్ష కేంద్రంకు విద్యార్థుల బదిలీ



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పరిశీలక బృందం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో కర్నూలు జిల్లాలో జరుగుతున్న దూరవిద్య పరీక్ష కేంద్రాలను ప్రత్యేక పరిశీలక బృందం సోమవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టింది. తనిఖీలలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గూడూరు పట్టణంలో ఉన్న శ్రీ శ్రీనివాస జూనియర్‌ కళాశాలలో యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్టు గుర్తించడం జరిగిందని తెలిపారు. పరీక్ష నిర్వాహకులు పలు అవకతవతలకు పాల్పడినట్లు గుర్తించి, ఈ అంశాన్ని వర్సిటీ దూరవిద్య పరీక్షల కోఆర్డినేటర్‌ ఆచార్య డి.రామచంద్రన్‌ దృష్టికి తీసుకువెళ్లగా, అవకతలకు పాల్పడిన సెంటర్‌ను దగ్గరలో ఉన్న మరొక సెంటర్‌కు మార్చాలని ఆదేశించడం జరిగిందని వెల్లడించారు. దీంతో గూడూరు శ్రీ శ్రీనివాస జూనియర్‌ కళాశాల పరీక్ష కేంద్రాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. కేంద్రంలో పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కర్నూలు పట్టణంలోని బి.తాండ్రపాడు ఎస్‌ఎల్‌ఎస్‌ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులు ఆ పరీక్షా కేంద్రంలో పరీక్షలు రాసే ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- రెడ్‌ బుక్‌ ఇంకా ఓపెన్‌ చేయలేదు
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి



గుంటూరు మెడికల్‌: రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కోసం కృషి చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి చెప్పారు. సోమవారం గుంటూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీకి మంచి రోజులొచ్చాయని ప్రజలు సంతోష పడుతున్నారని చెప్పారు. రెడ్‌బుక్‌ ఇంకా ఓపెన్‌ చేయలేదని, ప్రతిపక్ష నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని విమర్శించారు. వైఎస్సార్‌ సీపీ నేతలపై ఆరోపణలు గుప్పించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్‌ నారాయణ, జిల్లా ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోషల్‌ మీడియాలో సర్పంచి వీడియో హల్‌చల్‌

పర్చూరు: సోషల్‌ మీడియాలో సర్పంచి సెల్ఫీ వీడియో తెగ వైరల్‌ అవుతోంది. దగ్గుబాడు గ్రామ సర్పంచి ఫొటోలు, బట్టలు తగులబెడుతున్న వీడియో సోషల్‌ మీడియాలో హల్‌చల్‌ చేస్తోంది. గ్రామంలో ఒక మహిళతో సన్నిహితంగా మెలుగుతున్నాడు. సర్పంచికి ఆమెతో విభేదాలు రావడంతో ఆమె అలిగి హైదరాబాద్‌ వెళ్లిపోయింది. దీంతో మనస్తాపంతో అతడు ఆమె దుస్తులు, ఇంట్లో ఉన్న దేవుడి చిత్రపటాలు, ఇతర ఫొటోలు తగులబెడుతున్న వీడియో సోషల్‌ మీడియాలో వైరల్‌గా అయింది.

పూర్తిస్థాయి వార్డెన్స్‌ను నియమించాలి

జిల్లా కలెక్టర్‌ నాగలక్ష్మికి ఏఐఎస్‌ఎఫ్‌ నాయకుల వినతి



జిల్లా కలెక్టర్‌ నాగలక్ష్మి వినతిపత్రం అందజేసిన ఏఐఎస్‌ఎఫ్‌ నాయకులు

లక్ష్మీపురం: జిల్లా వ్యాప్తంగా అనేక సోషల్‌ వెల్ఫేర్‌ హాస్టల్స్‌లో రెగ్యులర్‌ వార్డెన్స్‌ లేరని, తక్షణమే పూర్తిస్థాయి వార్డెన్‌లను నియమించాలని ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా కార్యదర్శి యశ్వంత్‌ అన్నారు. స్థానిక జిల్లా కలెక్టర్‌ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్‌కు ఏఐఎస్‌ఎఫ్‌ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వార్డెన్స్‌ హాస్టల్‌లో అందుబాటులో లేకపోవడం వలన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జిల్లా సోషల్‌ వెల్ఫేర్‌ కార్యాలయంలో దాదాపు ముగ్గురు వార్డెన్స్‌ ఆఫీస్‌ పని చేస్తున్నారని తక్షణమే వారికి పూర్తిస్థాయి వార్డెన్స్‌గా ఆదేశాలు జారీ చేయాలనీ కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు జి సాయి, ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్షులు డేవిడ్‌, నగర నాయకులు గౌతమ్‌, ప్రసన్న తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

రాజధాని ప్రాంతంలో పటిష్ట పోలీసు బందోబస్తు

- వీవీఐపీల రాకపోకలకు అనుగుణంగా ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి
- తుళ్లూరు డీఎస్పీ మురళీ కృష్ణ వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తుళ్ళూరు డీఎస్పీ మురళీ కృష్ణ

తాడికొండ: రాజధాని ప్రాంతంలో అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో తమ వ్యవస్థ ఉండేలా పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. సోమవారం తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ ఐఏఎస్‌లు, వీఐపీలు, వీవీఐపీలు, జడ్జిలు ఇతర వ్యక్తుల రాకపోకలు నిత్యం ఉంటున్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ నెల 7న తుళ్లూరు మండలంలో సీఎం కార్యక్రమం ఉన్నందున సిబ్బందికి తగు సలహాలు, సూచనలు జారీ చేశారు. అమరావతి గ్రామ స్థాయి నుంచి పట్టణానికి మార్పు చెందుతుందని ఇందులో భాగంగా చిన్న చిన్న సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చే కొత్త వ్యక్తులు, ఆర్థిక సమస్యలు రకరకాల ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంటుంది కావున అందుకణుగుణంగా సిబ్బంది స్థాయి పెంచుకునేలా సిద్ధం చేస్తున్నామన్నారు. రాజధాని పనులు ప్రారంభమైతే వేలాది మంది కూలీలు వస్తారని, వారి కల్చర్‌ వేరుగా ఉండటం వారు ఇక్కడ నివసించడం వలన ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసేలా తమ శాఖ సిద్ధంగా ఉందన్నారు. ప్రస్తుతం వీవీఐపీల రాకపోకల వలన ట్రాఫిక్‌ సమస్య తప్ప ఎలాంటి సమస్య లేదని, ప్రజలు అందరూ సహకరిస్తున్నారని చెప్పారు. అసెంబ్లీలో 250, హైకోర్టులో 250 సెక్రటేరియట్‌ 250 మంది ఎస్‌పీఎఫ్‌ సిబ్బంది, మూడు బెటాలియన్‌లు ఏపీఎస్‌పీ సిబ్బంది, ట్రాఫిక్‌కు అదనంగా 80 మంది పోలీసులను ప్రత్యేకంగా కేటాయించినందున రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. ఇంకా సిబ్బంది సంఖ్యను పెంచాలని కోరామని, త్వరలో సిబ్బంది సంఖ్యను పెంచే అవకాశం ఉందన్నారు. సమావేశంలో తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'వెయిట్‌ లిఫ్టింగ్‌' చాంపియన్‌షిప్‌ ఈస్ట్‌గోదావరి



చాంపియన్‌షిప్‌ సాధించిన తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టుకు బహుమతి ప్రదానం



చాంపియన్‌షిప్‌ సాధించిన తూర్పుగోదావరి జిల్లా బాలుర జట్టుకు బహుమతి ప్రదానం

రన్నర్‌గా గుంటూరు జిల్లా జట్లు

తెనాలి: స్థానిక కోగంటి శివయ్య మున్సిపల్‌ హైస్కూలులో మూడురోజులుగా జరిగిన స్కూల్‌గేమ్స్‌ ఫెడరేషన్‌ 68వ అంతర జిల్లాల (అండర్‌–17) వెయిట్‌ లిఫ్టింగ్‌ పోటీలు సోమవారంతో ముగిశాయి. రాష్ట్రం నలుమూలల నుంచి 300 మంది బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. బాలికలు, బాలుర విభాగాలు రెండింటిలోనూ తూర్పుగోదావరి జిల్లా జట్లు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోగా, గుంటూరు జిల్లా జట్లు రన్నర్స్‌ స్థానాన్ని దక్కించుకోవటం విశేషం. వ్యక్తిగత పోటీల్లో 81 కిలోల విభాగంలో తూర్పుగోదావరికి చెందిన సీహెచ్‌ శ్రీసాత్విక, ఎండీ నూర్జహాన్‌ (కృష్ణా), కె.తనుశ్రీ (గుంటూరు) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సాధించారు. 81 ప్లస్‌ కేటగిరీలో కె.అలేఖ్య (అనంతపురం), జి.స్వాతి (గుంటూరు), ఎన్‌.జ్యోత్స్న (తూర్పుగోదావరి) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందుకున్నారు. తూర్పుగోదావరికి చెందిన లిఫ్టరు సిహెచ్‌.జుహిత గుణ స్నాచ్‌లో 75 కిలోలు, క్లీన్‌ అండ్‌ జెర్క్‌లో 95 కిలోల బరువులనెత్తి, మొత్తం 170 కిలోలతో ఉత్తమ లిఫ్టరుగా ఎంపికైంది. బాలుర విభాగంలో 102 కిలోల విభాగంలో ఎ.సుబ్రహ్మణ్యం, ఎస్‌.దూద్‌వలి, వి.దీనరాజులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. 102 ప్లస్‌ విభాగంలో వి.అపురూప్‌, జీఎస్‌డీ శ్రీచంద్ర, టి.నవదీపక్‌లు వరుసగా మొదటి మూడు బహుమతులను సాధించారు. బాలుర విభాగంలో ఉత్తమ లిఫ్టర్‌గా కడపకు చెందిన మాబూ అర్షద్‌ ఎంపికయ్యారు.

గుంటూరు జిల్లా స్కూల్‌గేమ్స్‌ ఫెడరేషన్‌ కార్యదర్శి ఎం.రవికుమార్‌, ఆర్గనైజర్‌ నాగిరీష పర్యవేక్షించారు. ముగింపు వేడుకలో పావులూరి రాంబాబు, కన్నెగంటి మురళీకృష్ణ, దేవదాసు, పి.గోవింద్‌, ఎం.సూర్యప్రకాష్‌, కె.అశోక్‌, సీహెచ్‌ మానస, గోవర్ధిని, నాగవేణి, శ్రీనివాసరావు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు నిబంధనలు పాటించాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్‌ విజయలక్ష్మి



గుంటూరు మెడికల్‌: ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు నిబంధనలు తప్పక పాటించాలని జిల్లా అల్లోపతి ప్రైవేట్‌ ఎస్టాబ్లిష్‌మెంట్‌ యాక్ట్‌ రిజిస్ట్రేషన్‌ అథారిటీ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్‌ కొర్రా విజయలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె కార్యాలయంలో మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యం అందించే వైద్యుల సేవలకు వసూలు చేసే రుసుం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్‌ రూమ్‌ వద్ద ప్రదర్శించాలన్నారు. ఆసుపత్రుల్లో పనిచేసే వివిధ విభాగాల వైద్యుల పేర్లు రిజిస్ట్రేషన్‌ నెంబర్‌తో సహా ప్రదర్శించాలని తెలిపారు. అల్లోపతి రిజిస్ట్రేషన్‌ సర్టిఫికెట్‌, స్కానింగ్‌ మిషన్‌ ఉంటే దాని రిజిస్ట్రేషన్‌ సర్టిఫికెట్‌ తప్పనిసరిగా ప్రదర్శించాలని చెప్పారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో రుసుం చెల్లించి రెన్యువల్‌ చేయించుకోవాలని తెలిపారు. స్కానింగ్‌ మిషన్‌ ఉంటే దానికి సంబంధించి గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం తెలిపే బోర్డులను స్కానింగ్‌ రూములో, వెయిటింగ్‌ రూమ్‌ లో, రిసెప్షన్‌ రూములో విధిగా ప్రదర్శించాలని చెప్పారు. జిల్లా అధికారుల తనిఖీల్లో పై నిబంధనలు పాటించని ప్రైవేటు ఆసుపత్రులపై అల్లోపతిక్‌ ప్రైవేట్‌ ఎస్టాబ్లిష్మెంట్‌ యాక్ట్‌, గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు.

7న ఆచార్య ఎన్జీరంగా జయంత్యుత్సవాలు

గుంటూరు రూరల్‌: ఆచార్య ఎన్జీరంగా జయంత్యుత్సవాలను ఈనెల 7న నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో నిర్వహించనున్నట్లు ఆచార్య ఎన్జీరంగా ట్రస్ట్‌ ప్రతినిధులు తెలిపారు. సోమవారం లాంఫాంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏడీఆర్‌ డాక్టర్‌ పి. సత్యనారాయణ, ట్రస్ట్‌ ప్రతినిధులు మాట్లాడుతూ ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాంఫాం, ఆచార్య ఎన్జీరంగా ట్రస్ట్‌ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకలను లాంఫాంలో నిర్వహిస్తారన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెంనాయుడు, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్‌, ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌ తదితరులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్‌ ఆర్‌.చింతల గోవిందరాజులు, డాక్టర్‌ లావు రత్తయ్య, రైతునేస్తం ఫౌండేషన్‌ చైర్మన్‌ వై. వెంకటేశ్వరరావు, విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్‌ ఆర్‌. శారదజయలక్ష్మీదేవి ఆచార్య ఎన్జీరంగా చేసిన కృషిని వివరిస్తారన్నారు. కార్యక్రమంలో రైతులు శాస్త్రవేత్తలతో చర్చాగోష్ఠి, డ్రోన్‌ వినియోగం, తదితర విషయాలపై చర్చ జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

30 గ్రాముల బంగారం చోరీ

జే.పంగులూరు: ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఇంటి తాళం పగులగొట్టి, గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడిన ఘటన మండలంలోని అలవలపాడు గ్రామంలో సోమవారం జరిగింది. సుమారు 30 గ్రాముల బంగారాన్ని దోచుకెళ్లారు. రేణింగవరం ఎస్సై వినోద్‌బాబు వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గుంజి అంకమ్మరావు భార్య అనిత పొలం పనుల నిమిత్తం ఉదయం 9 గంటలకు ఇంటికి తాళం వేసి వెళ్లింది. సాయంత్రం 3 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూసుకోగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. బీరువా తలుపులు తెరిచి చూడగా, బీరువాలో మూడు జతల కమ్మలు, రెండు మాట్టీలు, ఒక చైన్‌, ఒక తాళిబొట్టును గుర్తుతెలియని దొంగలు అపహరించినట్లు ఎస్సై తెలిపారు. రేణింగవరం పోలీస్‌ స్టేషన్‌లో అనిత ఫిర్యాదు చేయడంతో ఎస్సై వినోద్‌బాబు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.